# కైలాసంలో కలికాలం




అద్దేపల్లి సుచిత్రాదేవి

"వినయ్, వినూ! ఏం చేస్తున్నావ్? ఒక్కపని చేసిపెట్టరా" లోపలనుంచి పార్వతీదేవి పిలిచింది.

"ఏమిటో చెబుదూ! ఆర్టికల్ మాంచి యింటరెస్టింగ్‌గా వుంది" చదువుతున్న పుస్తకం వదలకుండా, అక్కడ్నుంచేమాత్రం కదలకుండానే అరిచాడు వినాయకరావ్.

చేతిలో పుస్తకం వుంటే ఇంక ఇటు రాడనుకుని పార్వతీదేవే కొడుకు గదిలోకి వచ్చింది.

"ఏంలేదురా వినూ! గేస్ అయిపోయింది. కాస్త కిరోసిన్ తెచ్చిపెడుదూ, రాత్రి వంటక్కూడా లేదు" బ్రతిమాలుతూ అన్నది.

"మైగాడ్, ఇప్పుడే నేను మార్కెట్ నుంచి పడుతూ లేస్తూ నానా అవస్థలూపడి ఆ సిటీబస్సులో యజ్ఞం చేసి వచ్చాను. మళ్ళీ ఆ కిరోసిన్ క్యూలో నిలబడటమంటే నా వల్ల కాదు" తల అడ్డంగా తిప్పాడు వినాయకరావ్.

"అలా అంటే ఎలారా? అయినా నీ వాహనం ఏమయింది, సిటీబస్‌లో వచ్చానంటున్నావు?"

"అదా, దాన్ని బృహస్పతి మాష్టారు ఏదో ప్రయోగం చెయ్యాలంటే యిచ్చాను. ముందస్తుగా ఎలుకమీద తన ఫార్ములా ప్రభావం చూస్తా నన్నారు" పుస్తకం పేజీలు తిప్పుతూ తేలిగ్గా చెప్పాడు.

"అయ్యో, ఆ మతిమరుపు ప్రొఫెసర్‌గారికే యిచ్చావూ! ఒకటి కంపబోయి మరోటి కలిపి దాన్ని కాస్తా ఆ పిచ్చిదానిపై ప్రయోగించేస్తాడురా" పార్వతీదేవి మూషికాన్ని తలుచుకుని అదుర్దాపడింది.

అప్పుడే అటువచ్చిన కుమారస్వామి అందుకున్నాడు —

"అవును మమ్మీ! అసలా మూషికాన్ని వదిలించుకుందుకు కావాలనే బృహస్పతిగారడక్కముందే అన్నయ్యే యిచ్చివుంటాడు. 'మంచి స్కూటర్ కొనమని డాడీతో చెబుదామంటే —గా పొడు ఎలకొకటి నా ప్రాణానికి' అని చాలాసార్లు విసుక్కోవటము నేను విన్నాను."

వినాయకరావుకి కోపం వచ్చింది. "అవును అంటాను. నా వాహనం నా యిష్టం. అయినా మయూరం మీదెక్కి విహరించటమనుకున్నావా, ఎలుకమీద వూరేగటం? నీకేం తెలుసు. అసలు నా గొడవలన్నీ నీ కెందుకు?" తమ్ముడిమీద ఎగిరి, చేతిలో పుస్తకంతో విసురుగా ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు వినాయకరావ్.

"సర్లే, యిప్పుడా గొడవెందుగ్గాని, ఒరేయ్ సుబ్రమణ్యాం కాస్త నువ్వయినా వెళ్ళి కిరోసిన్ తెచ్చిపెడుదూ." మళ్ళీ చిన్నకొడుకును బ్రతిమాలుకోసాగింది పార్వతీదేవి.

"అబ్బా, సుబ్రమణ్యాం ఏమిటి? పాత చింతకాయ పచ్చడి పేరూ! చక్కగా 'కుమార్ అని పిలువు' అని ఎన్నిసార్లు చెప్పాలి నీకు. ఈసారలా పిలిస్తే నేను పలకనంతే" కుమారస్వామి తల్లికి వార్నింగిచ్చాడు.

పార్వతీదేవి శాంతంగా "అలాగేలేరా, ఎలాగోలా పిలుస్తాను. ముందా కిరోసిన్ సంగతి చూడు."

అంతవరకూ తల్లి మాటలు ఏదో పరధ్యానంగా వింటున్న కుమారస్వామి 'కిరోసిన్' అనగానే వులిక్కిపడి, "ఏమిటీ కిరోసినా! బాప్‌రే అదేమన్నా వరాలు పొందిన రాక్షసుడ్ని హతమార్చటమనుకున్నావా? ఎంత క్యూ, ఎంత యుద్ధం! అయ్యబాబోయ్! నావల్లకాదు. ఈ పూట ఏ బ్రెడ్డో, పండ్లో పెట్టెయ్. రేపొద్దున నందీశ్వర్ వస్తాడుగా. అతగాడిని పంపించావంటే ఎలాగోలా కుమ్ముకుంటూ వెళ్ళి నీకు కిరోసిన్ పట్టుకొస్తాడు." అంటూ ఓ వుచిత సలహా యిచ్చి చల్లగా అక్కడ్నుంచి జారుకున్నాడు.

"ప్చ్, అంతా ఖర్మ. ఏం చెయ్యాలి. ఇద్దరు కొడుకులున్నారు. ఒక్కడూ ఒక్క పనీ చేసుకురారు. అదేమంటే కబుర్లు చెబుతారు. ఎంతమంది పనివాళ్ళున్నా అంతా ఆఫీసు వర్కు చేసేవాళ్ళే, యిక యింటి పనెవరు చేస్తారు. ఈయనకేమో యింటి ధ్యాస పట్టదు. ఎంతసేపూ తాళాలు, తాండవాలు అంటూ ఆ మ్యూజిక్ కాలేజీ పట్టుకు వదిలిరారు. ఒక్కదాన్ని ఎన్నింటినని చూసుకునేది?" పార్వతీదేవి విసుక్కుంటూ వంటింటివైపు నడిచింది.

* * *

కాలింగ్ బెల్ మోత విని అల్లుతున్న వూలు బేగ్ను పక్కనపెట్టి యివతలకొచ్చింది పార్వతీదేవి.

దిక్పాలకుల భార్యలు, మిగతా దేవలోకంలోని స్త్రీలు చాలామంది వున్నారు బయట.






"ఏమిటే, అంతా ఒక్కసారే వచ్చారు" నవ్వుతూ పలకరించింది.

"మన మహిళామండలి అంతా కలిసి స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల గురించి నిరసనగా వూరేగింపు జరపాలనుకుంటున్నాము కదా! కోరుకోబోతున్న భద్రతలు, హక్కులపై మనలోనే చాలా మంది పలురకాల అభిప్రాయాలు చెబుతున్నారు. ఒకరు చెప్పేది మరొకరికి నచ్చటంలేదు. ఏం చెయ్యాలా అని..." గాలిరావు భార్య విశదపర్చింది.

పార్వతీదేవి అదే చిరునవ్వుతో అందర్నీ కూచోమని సైగ చేసింది. ఆశీనులయిన అందర్నీ కలియజూస్తూ వుపన్యాస ధోరణిలో గొంతు సవరించుకుంది —

"చూడండీ, మనలో మనకే యిన్ని విభేదాలుంటే యిక సాధించేదేం వుండదు. ఒకరి అభిప్రాయం మరొకరు కాదనటం కేవలం వ్యక్తిగత కక్షల కారణమేనని నాకు తెలుసు. ఒకరు సూచించిన న్యాయమైన హక్కుని మరొకరు అలాక్కాదంటే యిక అడిగేదేమిటి? మనం సమాజ శ్రేయస్సు చూడాలి. సాటి వనితకు జరుగుతున్న అన్యాయం దృష్టిలో పెట్టుకోవాలి. నిన్న ఒక సామాన్యురాలికి జరిగిన అవమానమే రేపు మనకు జరగవచ్చు. చేతులు కాలాక ఆకులు పట్టుకోకూడదు. ముందు జాగ్రత్తతో ఆలోచించండి. ఒక్క రోజైనా మీ అసూయలు, ద్వేషాలు మరిచిపోండి. అందరం ఒక్క త్రాటిమీదే నడవాలని, మంచిదైన ఒక ఏకాభిప్రాయానికి రండి. ఇంతకన్నా నేను చెప్పేదేముంది!" మృదువుగానే అన్నది.

స్త్రీ లోకమంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"ఎన్ని మాటలయినా నవ్వుతూనే ముఖాన అనెయ్యగలదీవిడ" అనుకున్నారు కొందరు.

ఆ తర్వాత పార్వతీదేవి యిచ్చిన మంచుముక్కల నీళ్ళు తాగి "రేపే నిరసన ప్రదర్శన! ముందు మీరే వుండాల"ని మరీ మరీ చెప్పి బయటపడ్డారు.

వాళ్ళలా వెళ్ళగానే పరమశివుడు లోపలికి వచ్చాడు. ఆయన్ని చూస్తూనే పార్వతీదేవి కప్పుతో కాఫీ తీసుకువచ్చింది.

చర్మపు యీజీ ఛైర్లో వాలి ఓ నిముషం రిలాక్స్ అయి, చిన్నగా కాఫీ సిప్ చేసాడు. వెంటనే ముఖం గంటు పెట్టుకుని భార్యవైపు చూసాడు — "ఏమిటే కాఫీలో అసలు చక్కెరే వెయ్యలేదా?"

"చక్కెరా! ఆ మాటే ఎత్తకండి. ఇంకొన్ని రోజులకు అదెలా వుంటుందో కూడా మరిచిపోవాల్సి వుంటుంది. అయినా మీకేం, విషమే మింగినవాళ్ళు చక్కెరలేని కాఫీ తాగలేరూ! ఎటొచ్చీ ఇబ్బందంతా మాకే" దిగులుగా అన్నది.

"మరీ అంత డిమాండుగా వుందా?" చేదు కాఫీ గుటకలు వేస్తూ అడిగాడు పరమశివుడు.

పార్వతీదేవికి ముంచుక కోపం వచ్చింది. "అసలు మీకే విషయాలు పడతాయి చెప్పండి? వూరంతా పలుకుబడే! కానీ కిలో చక్కెరకు దిక్కుండదు. సరే అదలా వుండనివ్వండి. ఇంతకీ కుమార్ విషయమేమన్నా ఆలోచించారా?"

చప్పున కప్పు కింద పెట్టేసి, ప్రొద్దున హడావుడిలో అసంపూర్తిగా చదివిన పేపరందుకుని ముఖానికి అడ్డు పెట్టుకున్నాడు శివుడు.

"ఉద్యోగాలకి ఎంత తన్నుకు లాడుతున్నారో ఏమయినా చూస్తున్నారా? అందునా నీ కొడుక్కి చిన్న చిన్న పోస్టులు పనికిరావాయే - అధికార హోదాలు తప్ప" మెల్లగా అన్నాడు.

"మహ వేయించారులెద్దూ! పెద్దబ్బాయిని మీ డిపార్టుమెంటులోనే గణపతిని చేసారు. అదీ గొప్పేనా? అసలందులో ఓ ఎదుగూ బొదుగూలేదు అవాయిపు అంతకన్నా లేదు."

ఆ అభియోగానికి మౌనం వహించేడు పరమశివుడు. కొద్దిసేపుండి "సుబ్రమణ్యాన్ని ఓ సారి మహేంద్రరావుని కలుసుకోమని చెప్పరాదూ?" సాలోచనగా అన్నాడు

"ఇంత బ్రతుకు బ్రతికి, మన బ్బాయే స్వయంగా ..." ఆపై మాట్లాడలేక ఆయాసం వచ్చింది పార్వతీదేవికి.

ఆమెవైపోసారి చూసి మౌనంగా పేపర్లో తలదూర్చాడు. ఓ పేరా చదివి నవ్వుతూ తలెత్తాడు. "అమెరికావాళ్ళు మళ్ళీ కొలంబియాని ప్రయోగిస్తున్నారట!"

"నేనూ పేపర్ చూసాను" కరుగ్గా అన్నది. 'ఇంటి విషయాలు మాట్లాడుతుంటే మధ్యలో యివెందుకూ' అని కోపం వచ్చింది ఆమెకు.

భార్య కోపం గ్రహించినవాడై, శాంతపరచటం భర్త కర్తవ్యమనిపించింది శివుడికి. "ఏం చెయ్యాలా?" అని ఆలోచిస్తే ఆడవాళ్ళని ప్రసన్నలుగా చేసుకోవాలంటే ముందస్తుగా వాళ్ళ దగ్గర కొంచెం గారాలు పోవాలని ఎక్కడో, ఎప్పుడో చదివినది గుర్తొచ్చింది. వెంటనే కవాలని పేపర్ విసుగ్గా పక్కన పడేసి, భార్యవైపు తిరిగి కొంచెం గోముగా "అబ్బ, చాలా తలనొప్పిగా వుంది" అన్నాడు.

పార్వతీదేవి భర్తవైపు దీర్ఘంగా చూసింది.

"కొంచెం జలుబు కూడా చేసినట్లుంది" ముఖం బాధగా పెట్టాడు.

'ఇక ఆమె తనను లాలించడమే తరువాయి' అనుకుంటున్నంతలో అనుకోని తీవ్ర ఫలితం ఎదురయింది.

ఆ మాటతో ఏదో గుర్తుకువచ్చిన పార్వతీదేవి అపరకాళియై గయ్యిమని లేచింది — "జలుబు చెయ్యదూ మరి! నెత్తిన ఆవిడగారిని పెట్టుకు వూరేగుతుంటే! అసలు మీతో నేను కాబట్టి కాపురం చేస్తున్నాను. ఇంకోరింకోరయితేనా?" విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

పరమశివుడు తెల్లబోయాడు. తర్వాత "అరెరెరెరె" అనుకున్నాడు. కానీ యిక చేసేదేముంది? భార్య వెళ్ళిన దిక్కే చూస్తూ "సారూ" బాధగా గొణిగాడు దేవదాసులా. ★

"ఏకదంత ముపాస్మహే"



—ఫొటో : సుధాకర్ యడవల్లి